క్లుప్తంగా

పీవీఎల్ విజయం ఖాయం


ఎస్కే మాబూ


కురెళ్ల పాలు

ఆకివీడు: ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు విజయం ఖాయమని పట్టణ వైఎస్సార్ సీపీ కార్యదర్శి ఎస్కే మాబూ, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కురెళ్ల పాలు గురువారం విలేకరులకు తెలిపారు. పార్టీ విజయావకాశాలపై వారు మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో పీవీఎల్ నర్శింహరాజు విజయంలో ముస్లింలు, క్రిస్టియన్లు, ఎస్సీ, బీసీల ఓట్లతోపాటు మహిళల ఓట్లు కీలకంగా ఉంటాయని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేయడంలో పీవీఎల్ చేసిన కృషిని ప్రతి ఓటరూ గుర్తుంచుకున్నారని చెప్పారు.

వైభవంగా వరదరాజ స్వామి కల్యాణం


దుంపగడపలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: మండలంలోని దుంపగపడ గ్రామంలో వేంచేసియున్న అతి పురాతన వరద రాజా స్వామి ఆలయంలో త్రయాహ్నిక దీక్షతో కల్యాణోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కల్యాణ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రామిశెట్టి సూర్య ప్రసాద్ దంపతులు పాల్గొన్ని శాస్త్రోక్తంగా కల్యాణ తంతును జరిపించారు. అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో మూర్తి హోమం, మహాపూర్ణాహుతి, చక్రస్నానం, వసంతోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని చైర్మన్ సూరి ప్రసాద్ చెప్పారు.

వేల్పూరులో వేసవి శిక్షణ కార్యక్రమాలు


వేసశి శిక్షణ కార్యక్రమంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

తణుకు టౌన్ : వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా తణుకు మండలం వేల్పూరు గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చదవడం, చెప్పించడం, పుస్తక సమీక్ష వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వైకుంతపాళీ ఆటను వివరించి ఆడించారు. ఈకార్యక్రమంలో విద్యార్థులతో పాటు రీసోర్సు పర్సన్ ఎల్ వెంకటరమణ, జీ బసవేశ్వరరావు, గ్రంథాలయ అధికారి వైవీ సాయిబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొల్లు సెంట్రల్: విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం పట్టణంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు నరసాపురం విద్యుత్ శాఖ ఈఈ బి.సురేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పాలకొల్లు అడవిపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ పాలకొల్లు టౌన్ 1 ఫీడర్ మరియు 11 కేవీ వాటర్ వర్క్స్ ఫీడర్ పరిధిలో కొత్త లైన్లు ఏర్పాటు, ట్రీ కటింగ్ పనులు నిమిత్తం ఉద యం 8గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నామని స్పష్టం చేశారు. శంభునిపేట, బంగారు వారి చెరువు గట్టు, బ్రాడీపేట, పెద్ద పోస్టాఫీసు, వెంకటేశ్వర కాలనీ, బ్యాంకు స్ట్రీట్, మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తామని వివరించారు.

అధ్వానంగా పంట కాలువ


చెత్తతో పూడుకుపోయిన చినమామిడిపల్లి వద్ద పంటకాలువ

నరసాపురం: పట్టణం మీదుగా చినమామిడిపల్లి–సరిపల్లి మీదుగా వెళ్లే పంట కాలువ అధ్వానంగా తయారైంది. పంటకాలువలో పూడిక పెరిగిపోయింది. అలాగే కాలువ నిండా చెత్త పేరుకుపోయింది. దీంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని చినమామిడిపల్లి నుంచి కొప్పర్రు వరకూ సుమారు 5వేల ఎకరాల భూములకు, దాదాపు 40 గ్రామాలకు సాగు, తాగునీటి అవసరాలకు ఈ కాలువే దిక్కు. అయితే ఎక్కడిక్కక్కడ చెత్త పేరుకుపోవడంతో ఇబ్బందిగా మారింది. ఈ కాలువపైన మండలంలోని రైతాంగం ఆధారపడి ఉంది. గత ఏడాది వేసవిలో కాలువలు కట్టేసి నీరు వదిలిన తర్వాత కూడా కాలువను శుభ్రం చేయలేదు. ఈ వేసవిలోనైనా కాలువ బాగు చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

పండు 'గొప్పే'

- తీర ప్రాంతాల్లో విస్తరిస్తున్న పెంపకం
- వనామీ రొయ్యల కల్చర్ నష్టాలతో పెంపకంపై ఆసక్తి
- పండు చేపను పెంచేందుకు మొగ్గు చూపిస్తున్న ఆక్వా రైతులు

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని తీర ప్రాంతాలలో పండు చేప సాగు విస్తరిస్తోంది. ఈ చేప ధర పెరగడంతో రైతులు సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. చేపలలో రారాజుగా పిలిచే ఈ చేపలో అధిక ప్రొటీనులు, కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉండటంతో ఈ చేపకు ధర ఎక్కువగా మార్కెట్లో పలుకుతుందని రైతులు అంటున్నారు. వనామీ రొయ్యలు వైరస్ బారిన పడటం, రొయ్య కౌంట్ ధరలు పతనకావడంతో కొంతమంది సన్న, చిన్న కారు రైతులు పండుగొప్పను పెంపకంపై మొగ్గు చూపుతున్నారు. పండు చేప ధర మార్కెట్లో స్థిరంగా ఉండటంతో తీర ప్రాంత రైతులు సాగు చేస్తున్నారు. ఎంపెడా ప్రభుత్వ పరంగా రైతులకు రుణాలు అందిస్తే పెంపకం విస్తరణ పెరుగుతుందని ఆక్వా రైతులు చెబుతున్నారు.

తీరంలో విస్తరిస్తున్న పెంపకం

తీర ప్రాంతంలో ఉప్పు నీరు ఎక్కువగా ఉండటంతో భీమవరం మండలంలోని లోసరి, దొంగపిండి, నాగిడిపాలెం, నాగేంద్రపురం, కొత్తపూసలమర్రు, దెయ్యాలతిప్ప, వెంప తదితర గ్రామాలలో సుమారు వెయ్యి ఎకరాలలో పండు చేప పెంపకం సాగిస్తున్నారు. సప్పు, ఉప్పు నీటిలో పెరిగే పండు చేప కేజీ నుంచి 2 కేజీల వరకు రూ. 350 ఉండగా రెండు కిలోలు పైగా వచ్చిన చేపలకు రూ. 380 మార్కెట్ ధర ఉంది. ఈ చేపను ఔరా, ముంబాయి, గోవా, కోల్‌కత్తా, బీహార్, ప్రాంతాలకే కాకుండా ఇతర దేశాలకు ఎగుమతులు చేస్తుంటారు. వీటితో భీమవరం ప్రాంతానికి విదేశీ మారకద్రవ్యం కోట్లలో చేకూరుతుంది.

చిన్న, సన్నకారు రైతులు మొగ్గు

ఎకరం, రెండు ఎకరాలలో పెంపకం చేసే వనామీ సాగులో నష్టాలు రావడంతో చిన్నకారు రైతులు ఎక్కువగా వీటిని పెంచేందుకు మొగ్గుచూపిస్తున్నారు. పెంపకంలో పెట్టుబడులు పోగా మిగులుబడి ఉంటుందని రైతులు అంటున్నారు.

జూన్, జులైలో...

జూన్, జులై నెలలో తీర ప్రాంతాలలో సముద్రం నుంచి వచ్చే కాల్వలలోను, గుంటలలోను ఈ సీడ్ దొరుకుతుంది. వీటిని సేకరించి రైతులు చెర్వులలో వేసి పెంపకం సాగిస్తున్నామని రైతులు అంటున్నారు.

సాగు విధానం

10 అడుగుల లోతు గల ఒక ఎకరం చెరువులో వెయ్యి పండు చేప పిల్లలు వదలాలి. వాటికి ఆహారంగా చైనా గొరకలు, చిన్నచిన్న బతుకున్న చేపలను రోజుకు 50 కిలోల నుంచి 70 కిలోల వరకు చిన్నచిన్న బతుకున్న చేపలను ఆహారంగా వేయాలి. ఇలా 18 నెలలు వరకు వేయాలని రైతులు చెబుతున్నారు. పెంపకం మధ్యలో కేజీపై బడిన చేపలను పట్టుబడి పట్టి మార్కెట్‌కు తరలించి, చెరువులో ఉన్న కిలో దిగువన ఉన్న చేపలను పెంచితే అధికంగా లాభాలు సాధించవచ్చని రైతులు అంటున్నారు.


పండు చేపలను పడుతున్న దృశ్యం


పండు చేపకు మేతగా వేసే చైనా గొరకలు

గొరకలు కోసం ఇబ్బందులు పడుతున్నాం

తీర ప్రాంతాలలో పండు చేప సాగు చేస్తున్నారు. ఈ చేపలకు ఇతర రాష్ట్రాలు, విదేశాలలో బాగా డిమాండ్ ఉంది. ఈ చేపలకు ఆహారంగా చైనా గొరకలు కేజీ రూ. 40 నుంచి 60 వరకు పెరిగిపోయింది. వీటికి మేతగా గొరకలు వేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– ఎన్ శ్రీరాములు, పెంపకం దారుడు, దొంగపిండి

ప్రభుత్వం పెంపకాన్ని ప్రోత్సహించాలి

తీర ప్రాంతాల్లో ఉప్పునీరు ఎక్కువగా ఉంటుంది. సముద్రపు చేపలు పెంపకమే ఈ భూములలో అనుకూలిస్తుంది. దీంతో ఈ చేపలకు అనుకూలంగా ఉంటుంది. ప్రభుత్వం పరంగా ఎంపెడా ఆధ్వర్యంలో బ్యాంకు రుణాలు ఇచ్చి ప్రొత్సహిస్తే బాగుంటుంది.

– ఆర్. నరసింహస్వామి, పెంపకందారుడు, గూట్లపాడు

23 నుంచి సువార్త సభలు

ఉండి: ఉండికి చెందిన పెనూయేలు ప్రెయర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 25 వరకు 19వ వార్షికోత్సవ సువార్త సభలు నిర్వహిస్తున్నట్లు పాస్టర్ ఈద విజయప్రసాద్, దాయం సునీత తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రతిరోజూ రాత్రి 7 గంటలకు చర్చ్‌లో జరిగే ఈ సభలకు రెవరెండ్ వి.జ్యోతిబాబు (ఇలపర్రు), రెవరెండ్ కె.జార్జ్‌బుష్(ఉయ్యూరు) వాక్యోపదేశం చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొనాలని కోరారు.

కాయ్ రాజా కాయ్..!

తణుకు: 'ఈ ఓవర్లో వికెట్ పడుతుంది.. మీది వెయ్యి మాది ఆరు వందలు'... 'మ్యాచ్ ఫలానా జట్టు గెలుస్తుంది.. మీ పందెం పదివేలు.. మాది పదిహేను వేలు' ఇది 'ఐపీఎల్ రోజువారీ బెట్టింగ్' 'మా పార్టీ అభ్యర్థి గెలుస్తాడు.. మా పార్టీ అభ్యర్థి మెజారిటీ ఇంత మీ పందెం రూ. లక్ష.. మాది రూ. 70 వేలు' ఇది రాజకీయ జూదం.. తణుకు ప్రాంతంలో పందాల జోరు హోరెత్తుతోంది. ఓ వైపు ఇండియన్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగడంతో మ్యాచ్లపై బెట్టింగ్‌లు యథేచ్ఛగా సాగుతున్నాయి. మరో వైపు ఇండియన్ పొలిటికల్ లీగ్ తోడవడంతో బెట్టింగ్ రాయుళ్లకు పండగే పండగ. పట్టణం, పల్లెలు తేడా లేకుండా పందేలు జోరందుకున్నాయి. దాబాలు, రెస్టారెంట్లు, హోటళ్లు, అపార్ట్‌మెంట్లు వేదికగా క్రికెట్‌తో పాటు పొలిటికల్ బెట్టింగ్‌లు సాగుతున్నాయి. సగటున రూ.లక్షలు పందం కాస్తుండగా మొత్తంగా కలిపి రూ. కోట్లకు చేరినట్లు తెలుస్తోంది. ఐపీఎల్ నాకౌట్ పోటీలతో పాటు ఎన్నికల ఫలితాలకు రోజులు దగ్గర పడుతున్న కొద్దీ ఈ బెట్టింగ్ విశ్వరూపం దాల్చే పరిస్థితి కనబడుతోంది. ఈ బెట్టింగ్‌లకు నగదుతో పాటు ఆస్తులు, వాహనాలు, బంగారు ఆభరణాలు, సెల్ ఫోన్లు కూడా పెడుతున్నట్లు తెలుస్తోంది.

మీది ఇంత.. మాది ఇంత..

ఐపీఎల్ విషయానికి వస్తే ఓవర్‌కు పరుగులు, వికెట్లు పడే సమయాలు, నోబాల్స్, వైడ్లు ఎప్పుడు పడతాయి.. ఫోర్లు, సిక్సర్లు ఎప్పుడు కొడతారు. వీటికి రూ.వేలల్లో పందేలు వేసుకుంటు న్నారు. ఆఖరిగా మ్యాచ్ ఫలితాలపై భారీగానే పందాలు సాగుతున్నాయి. జట్ల బలాబలాలను బట్టి పందెం రాయుళ్లు బరిలోకి దిగుతున్నారు. ఒక జట్టు బలహీనంగా ఉంటే దానిపై తక్కువ మొత్తం పందెం వేస్తున్నారు. బలమైన జట్టు వైపు ఉన్నవారు దానికి కాస్త ఎక్కువ మొత్తం పందెం కాస్తున్నారు. ఉదాహరణకు బలమైన జట్టుపై రూ. పది వేలు పెడితే.. బలహీనమైన జట్టుపై రూ.5 వేలను నుంచి 7 వేల వరకు. ఈ పందేల కోసం ప్రత్యేకంగా పేకాట మాదిరిగా డెన్లు ఏర్పాటు చేసుకుంటున్నట్లు సమాచారం.

కోసు పందేలు

రాజకీయ బెట్టింగ్ విషయానికివస్తే వివిధపార్టీల అభ్యర్థులు విజయం సాధిస్తారని.. అదే సమయంలో వారికి వచ్చే మెజారిటీపై కూడా పందేలు నడుస్తున్నాయి. ప్రస్తుతానికి ఎన్నికల ఫలితాలకు దాదాపు 20 రోజులు సమయం ఉన్నందున ప్రాథమికంగా రూ. లక్షల్లో పందేలు కడుతున్నారు. ఫలితాల రోజు దగ్గర పడుతున్న కొద్దీ బెట్టింగ్‌లు ఘణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి.

డెంగీ వ్యాధిపై అవగాహన అవసరం


కాళ్ల ప్రభుత్వ వైద్యులు సునీల్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న పెదకాపవరం పీహెచ్‌సీ సిబ్బంది.


పాలకోడేరులో పీహెచ్ సి వైద్యాధికారి రంగమ నాయుడు ఆధ్వర్యంలోర్యాలీ చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

కాళ్ల పీ హెచ్ సి వద్ద జాతీయ డెంగీ దినోత్సవం...

కాళ్ల: డెంగీ వ్యాధిపై అవగాహన అవసరమైని కాళ్ల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి ఎస్ఎస్ సునీల్ తెలిపారు. కాళ్ల ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గురువారం జాతీయ డెంగీ దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారులు సిబ్బందితో కలిసి గ్రామంలో ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు సునీల్ మాట్లాడుతూ ఇంటి పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచనలు చేశారు. ఇంటి వద్ద పనికిరాని వస్తువులు, టైర్లు ఇతర వస్తువుల్లో నీరు నిలవ లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. దోమల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. ఎటువంటి లక్షణాలున్నా ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స పొంది వైద్య సదుపాయం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సునీత, సిహెచ్ఓ విజయశాంతి, ఎం పి హెచ్ ఈ ఓ పాల్సన్, వైద్యాధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడులో..

ఆకివీడు: డెంగీ వ్యాధిని అంతమొందించేందుకు ప్రజలు ముందుకు రావాలని మండలంలోని పెద కాపవరం పీహెచ్‌సీ వైద్యుడు ఆర్.రమేష్ పిలుపునిచ్చారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా గురువారం ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వల్ని తక్షణం తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ జుత్తిగ సత్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డాక్టర్ సీహెచ్ రంగంనాయుడు ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా పరిసరాలు పరిశుభ్రం గా ఉంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ స్వర్ణనిరంజని, సీహెచ్ఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

భీమవరం అర్బన్: భీమవం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాలు మేరకు గురువారం ఎస్సై జి. రాజు తన సిబ్బందితో పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. కొవ్వాడ పుంతలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 20,860ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వర్షంతో చల్లబడ్డ వాతావరణం

నరసాపురం: నరసాపురం ప్రాంతంలో గురువారం తెల్లవారుజామున తేలికపాటి వర్షంపడింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వర్షంతో పాటు సాయంత్రం వరకూ వాతావరణం మేఘావృతం కావడంతో కొన్ని రోజులుగా విపరీతమైన ఎండ, ఉక్కబోతలతో అల్లాడుతున్న జనం ఉపశమనం పొందారు. కొన్ని రోజులుగా ఎండలతో మధ్యాహ్నం పూట జనసంచారం లేక వెలవెలబోయిన మార్కెట్ ప్రాంతం జనంతో కళకళలాడింది. మరో రెండు రోజులపాటు ఇదే రకమైన పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ తెలపడంతో జనం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే వాతావరణంలో అకాలమార్పుతో తీరంలో ఉప్పు రైతులు ఆందోళన చెందుతున్నారు.

వెల్లువెత్తిన మహిళా చైతన్యం

అత్యధికంగా ఓటు హక్కు వినియోగించుకున్న వైనం


భీమవరంలో ఓటు వేసేందుకు బారులుతీరిన ఓటర్లు(ఫైల్

భీమవరం: గడిచిన ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన ప్రతి సంక్షేమ పథకంలో మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో ఆరుణం తీర్చుకొనే విధంగా తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భీమవరం నియోజకవర్గంలో మహిళా ఓటర్లు అత్యధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. భీమవరం నియోజకవర్గంలో ఈనెల 13వ తేదిన నిర్వహించిన సార్వత్రి ఎన్నికల్లో పురుషులు కంటే 2,482 మంది మహిళలు అధికంగా ఓట్లు వేశారు. నియోజకవర్గంలోని భీమవరం పట్టణం, వీరవాసరం, భీమవరం రూరల్ మండలాల్లో 2,53,116 ఓట్లుకుగాను 1,30,275 మంది మహిళలు, 1,22,790 మంది పురుషులు, 51 మంది ఇతరులు ఓట్లు కలిగి ఉన్నారు. సోమవారం నిర్వహించిన పోలింగ్‌లో 2,00,857 మంది ఓటు హక్కును వినియోగించుకోగా వీరిలో 1,01,656 మంది మహిళలు, 99,174 మంది మహిళలు, 27 మంది ఇతరులున్నారు. మొత్తం 79.35 శాతం పోలింగ్ నమోదైంది. భీమవరం రూరల్‌లో 71 పోలింగ్ బూత్‌లకు గాను 72,840 మంది ఓటర్ల ఉండగా వీరిలో 36,789 మంది మహిళలు, 36,051 మంది మహిళలున్నారు. భీమవరం మండలంలో 61,879 ఓట్లు పోల్‌కాగా వీరిలో పురుషులు 31,466 మంది, మహిళలు 30,413 మంది ఓట్లు వేశారు. భీమవరం మండలంలో పోలైన ఓట్లలో మహిళలకంటే పురుషులే 1.053 మంది ఓట్లు వేశారు. భీమవరం పట్టణంలో 1,25,218 ఓట్లుకుగాను 110 పోలింగ్ బూత్‌ల్లో పురుషులు 59,715 మంది, మహిళలు 65,453 మంది, ఇతరులు 50 మంది ఉన్నారు. వీరిలో 92, 157 మంది ఓటుహక్కును వినియోగించుకోగా 47,670 మంది మహిళలు, 44,461 మంది మహిళలు, 26 మంది ఇతరులున్నారు. పట్టణంలో పురుషులు కంటే 3,209 మంది మహిళలు అదనంగా ఓట్లు వేశారు. వీరవాసరం మండలంలో 55,058 మంది ఓటర్లకుగాను 28,033 మంది మహిళలు, 27,024 మంది పురుషులు, ఇతరులు ఒకరు ఉన్నారు. వీరవాసరం మండలంలో 55 పోలింగ్‌బూత్‌ల్లో మొత్తం 46,821 మంది ఓట్లు వేయగా వీరిలో 23,573 మంది మహిళలు, 23,247 మంది మహిళలు, ఇతరులు ఒకరు ఓటు వేశారు. ఇక్కడ పురుషులు కంటే 326 మంది మహిళలు అధికంగా ఓట్లు వేయడం విశేషం. భీమవరం మండలంలో 84.95 శాతం, పట్టణంలో 73.60 శాతం, వీరవాసరం మండలం 85.05 శాతం ఓటింగ్ నమోదైంది. దీంతో అత్యధికంగా మహిళా ఓటర్లు పాల్గొని అభ్యర్థుల జయాపజయాలను నిర్దేశించనున్నారని పరిశీలకులు చెబుతున్నారు. అత్యధికంగా పోలింగ్ నమోదు కావడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఈసారి ప్రజలు పట్టం కడుతున్నారనే అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది.

గడ్డికి యమ డిమాండ్


వరి చేలలో గడ్డిని వరిమోపులుగా కట్టిన దృశ్యం

పాలకోడేరు: మారుతున్న కాలంలో పెరిగిన సాంకేతికత వల్ల వ్యవసాయరంగంలో కీలకమార్పులు వచ్చాయి. ఫలితంగా పశువులకు ఎండు గడ్డి కొరత ఏర్పడుతుంది. గతంలో మనుషులతో వరి పంటను కోసి, ట్రాక్టర్ల తో నూర్పించేవారు.అప్పుడు ఎండు గడ్డి పుష్కలంగా లభించేది. దాన్ని పశు గ్రాసంగా ఉపయోగించుకునేవారు. అయితే మారుతున్న కాలంతో మనుషుల కూలీరేట్లు విపరీతంగా పెరగడం వల్ల, మనుషులతో రోజంతా చేయించే పని వరి కోత మెషీన్లతో గంటల వ్యవధిలోనే పూర్తయ్యి సమయం కలిసి రావడం వల్ల రైతులంతా యంత్రాల బాట పడుతున్నారు. ఫలితంగా పశుగ్రాసం కొరత ఏర్పడుతోంది. దాణా ఖర్చులు తట్టుకోలేక మెషీన్ ద్వారా కోసిన గడ్డిని, యంత్రాల ద్వారా మోపులుగా చుట్టించి, పశువులకు కావలసిన ఎండు గడ్డిని సమకూర్చుకుంటున్నారు. ఇలాంటి మోపులను 35 రూపాయలు చొప్పున కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఈ లెక్కన ఎకరా గడ్డి 8 నుంచి 10 వేల రూపాయలు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. కాగా అంతా మొత్తం ఖర్చు పెట్టినా అవసరం మేరకు ఎండు గడ్డి దొరకడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.


పాలకోడేరులో ట్రాక్టర్లపై గడ్డిని తరలిస్తున్న దృశ్యం

19న విద్యార్థులకు ప్రతిభ అవార్డులు

భీమవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ఈనెల 19వ తేదిన మానవతసంస్థ ఆధ్వర్యంలో ప్రతిభ అవార్డులు ప్రధానం చేయనున్నట్లు మానవత భీమవరం శాఖ అధ్యక్షుడు బుద్దరాజు వెంకటపతిరాజు చెప్పారు. భీమవరం పట్టణం, రూరల్ పరిధిలోని ప్రభుత్వ ఉన్న పాఠశాలల్లో చదివి మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు పట్టణంలోని త్యాగరాజ భవనంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు అవార్డుల ప్రధానం ఉంటుందని వెంకటపతిరాజు తెలిపారు.

వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం



వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

నరసాపురం: నరసాపురం గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం గురువారం ప్రారంభమైంది. లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి ఆధ్వర్యంలో 40 రోజుల పాటు జరిగే ఈ శిక్షణ శిబిరాన్ని వైఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ ప్రారంభించారు. గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చినిమిల్లి మాట్లాడుతూ విద్యార్థులకు, పిల్లలకు ఉపయోగపడేలా ప్రతి ఏటా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. పుస్తకాలు చదివే అలవాటు విద్యార్థులు పెంపొందించుకోవాలని చెప్పారు. లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి మాట్లాడుతూ ఈ శిబిరంలో పుస్తక పఠనం, వ్యక్తిత్వ వికాసంపై ఉపన్యాసాలు ఇప్పించడం, చిన్నపిల్లలకు ఆటపాటలు ఉంటాయని చెప్పారు.